# భూకబ్జారాయుళ్లపై కొరడా

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తన మార్కు చర్యలు
- జేసీ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- కబ్జాదారులపై తొలుత కేసు నమోదు
- తిరిగి భూములు స్వాధీనం
- బి.కోడూరుతో మొదలు

**జగన్ పాలనలో కొందరు వైసీపీ నేతలు జిల్లాలో లెక్కలేనన్ని భూకబ్జాలకు పాల్పడ్డారు. ప్రభుత్వ భూములు, వాగులు, వంకలే కాకుండా చివరికి ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులను కూడా కొట్టేశారు. అప్పట్లో జనం దొంగల బారిన పడకుండా ఆస్తులు కాపాడుకున్నట్లుగా వారి ఆస్తులకు కాపలా ఉండేవారు. అధికారంలోకి వస్తే జగన్ హయాంలో చేసిన భూకబ్జాలపై సిట్ వేసి స్వాధీనం చేసుకుంటామని పాదయాత్రలో నారా లోకేశ్, ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబునాయుడు వెల్లడించారు. ప్రభుత్వం వచ్చి ఏడునెలలు దాటింది. అయితే ఇటీవలే కడప జిల్లా కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తనదైన మార్కుతో ప్రభుత్వం లక్ష్యం మేరకు భూకబ్జాదారులపై కొరడా ఝులిపిస్తున్నారు. ఎక్కడా హడావుడి చేయకుండా అనుకున్న టార్గెట్ పూర్తి చేసుకుంటూ జగన్ హయాంలో కబ్జాలకు పాల్పడిన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు.**

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జిల్లాలో దాదాపు 3వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు, వాగులను ఆక్రమించారు. ఏ ఊరిలో ఎంత భూమిని ఆక్రమించారు, అందులో డీకేటి ఎంత, వాగులు వంకలు ఏంటి, ప్రైవేటు ఆస్తులు అన్నింటిలో కూడా పక్కాగా తన సిబ్బంది ద్వారా డేటా తెప్పించుకున్నారు. దాదాపు 3వేల ఎకరాల భూములు వైసీపీ చేతల్లో ఉన్నాయని నిర్ధారణకు వచ్చారు. వీటిలో వాగులు వంకలు, కొండలు చాలా మటుకు భూములున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆక్రమణకు గురైన భూములు తిరగి స్వాధీనం చేసుకునేందుకు కలెక్టరు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి.. సైలెంట్‌గా తమ టీంతో ఆ పనిలో ముందుకు పోతున్నారు.

### బి.కోడూరుతో మొదలు

జగన్‌హయాంలో జరిగిన భూకబ్జాలు గుట్టు రట్టు చేసేందుకు జేసీ అదితిసింగ్ నేతృత్వంలో జీఎన్ఎస్ కలెక్టరు, ఇతర ఆర్డీఓలు, లీగల్ టీంతో కలిసి ఓ ప్రత్యేకటాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. అన్యాకాంత్రమైన భూములు స్వాధీనం చేసుకునేందుకు ఈ టాస్క్‌ఫోర్స్ లక్ష్యం. ఇప్పటికే వైసీపీ హయాంలో జరిగిన ప్రభుత్వ భూముల కబ్జాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అయితే రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ చూసి కలెక్టరు ఆశ్చర్యపడే స్థాయికి వచ్చింది. కొన్ని చోట్ల రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ చేస్తే మరికొన్ని చోట్ల ఏకంగా రికార్డులే లేకుండా అప్పటి వైసీపీ గ్యాంగ్ ముందస్తు జాగ్రత్త తీసుకుని భూములను ఆక్రమించింది. ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్లుగా కలెక్టరు శ్రీధర్ కూడా తనదైన స్టైల్‌లో టీంతో అటాక్ చేయించి కబ్జాదారుల చేతల్లోని భూములు స్వాధీనం చేసుకున్నారు.

బి.కోడూరు మండలంలోని మున్నెల్లి రెవెన్యూ పొలం సర్వే నెం.2735. 2736 ప్రభుత్వ భూములను ఆక్రమించారు. ఇక్కడన్నీ కొండలు, గుట్టలు ఉన్నాయి. వీటిని కబ్జాదారుడు తమ సొంత ఆస్తి మాదిరిగా ఆక్రమించి ఎక్సకవేటరుతో చదను చేసి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. బెంగులూరులో ఉంటున్న ఓ వైసీపీ నేత నిబంధనలకు వ్యతిరేకంగా 8 ఎకరాలను ఆక్రమించడంతో పాటు ఐదెకరాల్లో పండ్లతోటలు నాటారు. ఇక్కెడ జరిగిన భూకబ్జాలపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు వచ్చాయి. దీనిపై కలెక్టరు చెరుకూరి శ్రీధర్ స్పందించారు. మూడు రోజులుగా బయట పడకుండా పక్కాగా పనులు చేశారు. జేసీ నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ తొలి పనిని ఇక్కడే మొదలుపెట్టారు శనివారం బద్వేలు ఆర్డీవో మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో అధికార యంత్రాంగం అక్కడికి వెళ్లి డ్రోన్‌తో సర్వే చేసి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు పెట్టారు. ఇక బి.కోడూరు మండలంలోని ఐత్రంపేట రెవెన్యూ విలేజీ సర్వేనెం. 2735-2, 2767, 2768, 2136, 2189, 2190లలో ఆక్రమణకు పాల్పడినట్లు కబ్జాదారులపై తహసీల్దారు మధునాయక్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లక్కిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, గోనగుంట హజ్రత్‌పై కేసులు నమోదు చేశారు.

### కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

జగన్ హయాంలో జరిగిన ప్రభుత్వ భూముల కబ్జాలపై కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రభుత్వ ఆదేశాల మేరకు చాలా సీరియస్‌గా తీసుకున్నారు. బద్వేలులో ఎస్సీల భూములు ఆక్రమించిన మున్సిపల్ వైస్‌చైర్మన్, మైదుకూరు మండలంలో తెలుగుగంగ భూములు ఆక్రమించి వ్యాపారం చేసిన వైసీపీ నేతలపై కేసులు నమోదయ్యాయి. అయితే పోలీసులు పట్టించుకోలేదు. కలెక్టరు శ్రీధర్ కబ్జాదారుల విషయంపై సీరియస్ కావడంతో చివరికి పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పుడు బి.కోడూరులో భూకబ్జాలపై ఆంధ్రజ్యోతిలో వార్తలు రావడంతో పరిశీలించి కబ్జాదారులపై కేసు నమోదు చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. త్వరలో బద్వేలు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, అట్లూరు, కడప, సీకేదిన్నె, వల్లూరు, కమలాపురం వీఎన్‌పల్లె, సింహాద్రిపురం, వేముల, చక్రాయపేట, చెన్నూరు ఇలా అన్ని చోట్ల భూకబ్జాలు బహిరంగం కానున్నాయి. కలెక్టరు శ్రీధర్ జేసీ నేతృత్వంలో ప్రత్యేక రోడ్‌మ్యాప్ తయారు చేసుకున్నారు.





బి.కోడూరు మండలంలో ఆక్రమణలకు గురైన బద్వేలు - పోరుమామిళ్ల ప్రధాని రహదారిలోని కొండలు, భూములు



రెవెన్యూ అధికారుల సర్వే

# నవదిన ప్రార్థనలో ప్రత్యేక కూడిక

కడప కల్చరల్ ఫిబ్రవరి 8, (ఆంధ్రజ్యోతి): మరియాపురం లూర్థుమాత తిరుణాల నవదిన పూజా ప్రార్థనలో భాగంగా శనివారం రాత్రి మరియాపురం పాత చర్చి ఆవరణలో ప్రత్యేక కూడిక నిర్వహించారు. విశ్వాసులనుద్దేశించి ఫాదర్ బెన్ని దైవసందేశం గావించారు. హృదయ పరివర్తన లేని 99 మంది నీతిమంతులకంటే హృదయ పరివర్తన కలిగిన ఒక పాపాత్ముడిపై దేవుడు ప్రీతి చూపుతారన్నారు. ప్రజలు పాప సంకీర్తనలతో యేసుప్రభువు వద్ద తమ పాపాలను ఒప్పుకుని పశ్చాత్తాప హృదయంతో పరివర్తన చెందాలని సూచించారు. అంతకు ముందు సాయంత్రం 5 గంటలకు మరియమాత స్వరూపాన్ని ఊరేగించారు. తదుపరి దివ్యబలిపూజను సీఆర్ఐ గురువులు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు విశ్వాసులు, గురువులు, ప్రజలు పాల్గొన్నారు.



# కలెక్టర్ రావాలని.. రభస

- సభ నుంచి వైసీపీ ప్రజాప్రతినిధుల నిష్క్రమణ
- జేసీ రాకతో సభ ప్రారంభం
- వైసీపీని ఇబ్బందిపెట్టడానికే డీఆర్‌సీ : ఎంపీ అవినాశ్‌రెడ్డి
- అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన ప్రశ్నలు జడ్పీ సభలో ప్రస్తావన
- అక్రమ మైనింగ్‌ను నిలుపుదల చేయించాలని తీర్మానం
- ప్రేక్షక పాత్రలో జడ్పీ చైర్‌పర్సన్
- హాజరుకాని పలువురు ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

కడప రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీసీ పాలక మండలి సారథ్యంలోని జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని శనివారం చైర్‌పర్సన్ జె.శారద అధ్యక్షతన నిర్వహించారు. 10 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశాన్ని ఎప్పటిలాగే 40నిమిషాలు ఆలస్యంగా ప్రారంభించారు. ఆ వెంటనే ఎంపీ అవినాష్‌రెడ్డి రమ్మన్నారంటూ పిలుపు రావడంతో జడ్పీ చైర్‌పర్సన్ హుటాహుటిన సమావేశం నుంచి తన చాంబర్‌కు వెళ్లిపోయారు. కాసేపటికి వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్‌యాదవ్ తదితర జడ్పీటీసీలతో కలిసి చైర్‌పర్సన్ శారద సమావేశానికి వచ్చారు. అజెండాను ప్రారంభించగానే పథకం ప్రకారం మూకుమ్మడిగా వైసీపీ ప్రజాప్రతినిధులు మాటల దాడిని కొనసాగించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయం దారుణంగా దెబ్బతిందని దీనిపై చర్చించడానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్లలో ఎవరో ఒకరు వస్తేనే సభలో ఉంటామంటూ చైర్‌పర్సన్‌తో సహా జడ్పీటీసీలు సభ నుంచి వెళ్లిపోయారు. సీఈవో ఓబులమ్మ పదేపదే సర్దిచెప్పినా వైసీపీ ప్రజాప్రతినిదులందరు పెడచెవినపెట్టి వెళ్లిపోయారు. కాసేపటికి జాయింట్ కలెక్టర్ సమావేశానికి రావడంతో తిరిగి వైసీపీ ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

### వైసీపీ వారిని ఇబ్బందిపెట్టడానికే..

ప్రజాసమస్యలపై చర్చించి వాటికి పరిష్కారం చూపాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో డీఆర్‌సీ (జిల్లా రిసోర్స్ డెవలప్‌మెంట్ కమిటీ) గురించి ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడడం ప్రత్యేకంగా నిలిచింది. వైసీపీ వారిని ఇబ్బంది పెట్టడానికి, కొంత మంది అధికారులపై ఒత్తిడి తేవడానికి, వారిని టార్గెట్ చేసి ట్రాన్స్‌ఫర్ చేయడానికి నిర్వహిస్తున్నారని చెప్పుకొచ్చారు.

### అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన ప్రశ్నలు

సమావేశానికి టీడీపీ, కూటమి ప్రజాప్రతినిధులు ఎవ్వరూ హాజరు కాకపోవడంతో వైసీపీ నేతలు ఏకపక్షంగా వ్యవహరించారు. అసెంబ్లీలో ప్రశ్నించాల్సిన అంశాలను జడ్పీ సభలో ప్రశ్నించి అధికారులను ఉక్కిరిబిక్కిరిచేశారు. ఎన్నికల అజెండాలోని అం శాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తేనే అధికారులు ఇప్లిమెంట్ చేస్తారని వైసీపీ ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికి పదేపదే ఎన్నికల హామీల అమలునే ప్రస్తావిస్తూ వైసీపీ మైలేజీ కోసం ప్రాకులాడారు.

### ప్రేక్షక పాత్రలో జడ్పీ చైర్‌పర్సన్

జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద ఎప్పటిలాగానే ప్రేక్షకపాత్ర వహించారు. ఉదయం 10-40కి సభను ప్రారంభించి తదుపరి అజెండాను సీఈవో కొనసాగించాలని చెప్పారు. తరువాత సమావేశం పూర్తయ్యేవరకు ఎలాంటి ప్రస్తావనను చేయకుండా కుర్చీకే పరిమితమయ్యారు.

### హాజరు కాని పలువురు ప్రజాప్రతినిధులు

జడ్పీ సర్వసభ్య సమావేశానికి టీడీపీకి చెదిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరూ హాజరుకాలేదు. జనసేన నుంచి రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ ఒక్కరే హాజరయ్యారు. ఆయన కూడా సమావేశం ప్రారంభం కాగానే కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. అలాగే బీజేపీ ఎమ్మెల్యే అధినారాయణరెడ్డి, వైసీపీకి చెందిన రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాధ్‌రెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డిలు కూడా హాజరు కాలేదు.

### పల్లెసీమల ప్రగతికి బాటలు : జేసీ

రాష్ట్ర ప్రభుత్వం పల్లెసీమల ప్రగతికి పెద్దపీటవేస్తోందని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు జడ్పీ సభ ద్వారా తెలియజేసిన సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలను చేపడతామన్నారు.

**జడ్పీ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రావాలని.. వారు వస్తేనే సమావేశాన్ని కొనసాగించాలని లేకుంటే వాయిదా వేయాలని వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి సహా మిలిగిన సభ్యులందరూ రభస చేశారు. ఇందుకు సీఈవో సి.ఓబులమ్మ జాయింట్ కలెక్టర్ క్యాంప్‌లో ఉన్నారని.. త్వరలో సమావేశానికి హాజరవుతారని.. ఈలోగా అజెండా వారీగా ప్రభుత్వ శాఖలపై చర్చించడానికి కలెక్టర్ ప్రతినిధులుగా జిల్లా అధికారులు ఉన్నారని సమావేశాన్ని కొనసాగిద్దామని ఎంత సర్దిచెప్పినా ససేమిరా అన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు లేనప్పుడు సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని సీఈవోపై ఎదురుదాడికి దిగారు. దీంతో సీఈవో సమావేశాన్ని నేను ఏర్పాటు చేయలేదు.. చైర్‌పర్సన్ అనుమతితోనే నిర్వహిస్తున్నామని సమాధానం ఇవ్వడంతో వైసీపీ ప్రజాప్రతినిధులు కంగుతిన్నారు.**

### అక్రమ మైనింగ్‌ను నిలుపుదల చేయించాలని తీర్మానం

పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లి మండలాల్లో భారీఎత్తున జరుగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలు తక్షణమే నిలుపుదల చేయించాలని జడ్పీ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. కొన్ని నెలలుగా ప్రతి రోజు రూ.కోట్లలో విలువైన బైరైటీస్, ముగ్గురాయిని గనులకు లీజ్‌లేకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. దీంతో సీనరేజీ డీఎంఎఫ్ రూపంలో ప్రభుత్వానికి రావలసిన కోట్ల రూపాయాల ఆదాయం రాకుండా పోతోందని తెలిపారు. ఈ అక్రమ మైనింగ్‌ను సత్వరమే నిలుపుదల చేయించి.. ప్రజాధనాన్ని సంరక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు.



సమావేశానికి కలెక్టర్, జేసీ రావాలని పట్టుబడుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి

సభనుద్దేశించి మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్



# వాస్తవాలను ఎలుగెత్తి చాటినపుడే సమాజంలో మార్పు

- ఏపీ అధికారభాషా సంఘం పూర్వ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్

కడప కల్చరల్, ఫిబ్రవరి 8, (ఆంధ్రజ్యోతి): నిజాయితీ, నిర్భీతితో సామాజిక వాస్తవాలను రచయితలు ఎలుగెత్తి చాటినపుడే సమాజంలో మార్పు తీసుకురాగలరని అవనిగడ్డ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వైయస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం రాయలసీమ భాగస్వామ్యం అనే శీర్షికతో రెండవ సాహిత్య సాంస్కృతిక మహాసభలు శనివారం ఐఎంఏ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా బుద్ధప్రసాద్ హాజరై మాట్లాడారు. తొలి తెలుగు శాసనం పుట్టిన గడప రాయలసీమ అని రాయలసీమ వాసులు మరింత చైతన్యవంతులై భాషను సజీవంగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. రాయలసీమలో పోతులూరి వీరబ్రహ్మం, వేమన లాంటి సంఘసంస్కర్తలు ఆనాటి సామాజిక చైతన్యం కోసం పాటుపడి లోపాలను కడిగిపారేశారన్నారు. రచయితలు వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ రచయితలు ధైర్యంగా సమాజంలో వున్న లోపాలను ఎత్తి చూపేలా రచనలు చేయాలన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ సంఘం ఆవిర్భావ వికాసాలను సభకు పరిచయం చేశారు. ప్రసిద్ధ చలనచిత్ర నటుడు శివకృష్ణ, ఎస్కే యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథశర్మ, సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు షేక్ హుసేన్, గానుగపెంట హనుమంతరావు, అలపర్తి పిచ్చయ్య చౌదరి, జింకా సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు. అనంతరం పలువురు రచయితలు రచించిన పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కవులు, సాహితీవేత్తలు, సాహితీప్రియులు పాల్గొన్నారు.

# ముంపు పరిహారం ఇవ్వాలి

- అదానీ కంపెనీలో ఉపాధి కల్పించాలి
- ఎమ్మెల్యే ఆది వర్గీయుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు

కొండాపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) గండికోట ముంపు పరిహారంతో పాటు తమ గ్రామాలకు చెందిన పలు సమస్యలను పరిష్కరించాలని... ఆదానీ హైడ్రోపవర్ కంపెనీలో ఉపాధి కల్పించాలని మండలంలోని చామలూరు, ఎర్రగుడి గ్రామాలకు చెందిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు శనివారం బాలప్ప కోన పంప్‌హౌస్ సమీపంలో ఆందోళనకు దిగారు. చామలూరు గ్రామానికి చెందిన 100 ఎకరాలు, ఎర్రగుడి గ్రామానికి చెందిన 50 ఎకరాల భూములకు గండికోట ప్రాజెక్టు కింద ముంపు పరిహా రం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఈ రెండు గ్రామాలకు సంబంధించి చాలా మందికి పునరావాసం ప్యాకేజీ అందలేదన్నారు. సోషియల్ ఎకనామిక్ సర్వేలో కూడా చాలా మంది పేర్లు లేవని, వెంటనే రీసర్వే చేయించి పరిహారం ఇవ్వాలన్నారు. చామాలూరు పునరావాస కాలనీకి శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆదానీ కంపెనీలో ఉపాధి కల్పించాలి.. గండికోట బ్యాక్‌వాటర్‌తో తమ గ్రామాలతో పాటు మరో 7 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బంది పడుతున్నారని సంకేపల్లి బ్రిడ్జిని వెంటనే నిర్మించాలన్నారు. జేసీ నాగిరెడ్డి మంచినీటి పథకం లీకేజీ వాటర్ వల్ల తమ ప్రాంతంలో ఇబ్బంది పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కోరారు. తమ గ్రామస్థుల వాహనాలు వెళితే ఫారెస్టు భూములంటూ ఫారెస్టు అధికారులు అడ్డు చెబుతున్నారని, ఆదానీ కంపెనీ వాహనా లకు మాత్రం ఎందుకు అడ్డు చెప్పడం లేదని ప్రశ్నించారు. రైతులకు ఒక న్యాయం, కంపెనీకి ఒక న్యాయమా అని వారు మండిపడ్డారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని.. లేకపోతే తమ గ్రామాల పరిధిలోని భూములలో ఆదానీ, దాని అనుబంధ సంస్థ రుత్విక్ వాహనాలను తిరగనివ్వమని రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులతో గంటసేపు రెండు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. కొండాపురం తహసీల్దార్ గురప్ప, సీఐ మహమ్మద్‌రఫీ జో క్యం చేసుకొని వారికి సర్దిచెప్పారు. దీంతో ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. 10 రోజుల్లో తమ సమస్యలకు పరిష్కారం చూపకపోతే వాహనాలను తమ ప్రాంతంలో తిరగనివ్వమని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆందోళన జరగకుండా పెద్దఎత్తున పోలీసులు మోహరించారు. కార్యక్రమంలో చామలూరు సర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, ఎర్ర గుడి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన సరదా

- ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నీటిలో మునిగి ఇద్దరు నేపాలి యువకుల మృతి

7



పీలేరు పట్టణం కట్టుకాలువ వీధిలోని ఆర్వో వాటర్ ప్లాంటు

# ఆశయం ఘనం...
# అమలు అస్తవ్యస్తం



కలకడ వారపు సంతలో మూతపడ్డ ఆర్వో ప్లాంటు

- త్రిశంకు స్వర్గంలో ఆర్వో వాటర్ ప్లాంట్లు
- జీతాల కోసం ఆపరేటర్ల ఎదురుచూపులు

పీలేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉచితంగా సురక్షిత తాగునీరు అందిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీలేరు నియోజకవర్గంలో ఇబ్బడి ముబ్బడిగా ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులతో కొన్ని, ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో మరికొన్ని, గ్రామ పంచాయతీ నిధులతో ఇంకొన్ని నిర్మించారు. 2021 నుంచి 2024 వరకు ఆదాయం ఉండే మేజర్ పంచాయతీల దగ్గర నుంచి నామమాత్రం ఆదాయం లేని పంచాయతీల్లోనూ వీటిని నిర్మించారు. నిర్మించిన మూడేళ్ల వరకు ఏపీఎండీసీ సీఎస్ఆర్ నిధులతో వాటిని నిర్వహించారు. ఆ సమయంలో ఆయా ప్లాంట్ల మొత్తం నిర్వహణతో పాటు ఆపరేటర్ల జీతభత్యాలు కూడా ఇచ్చేవారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో ఆ బాధ్యతల నుంచి ఏపీఎండీసీ తప్పుకుంది. అప్పటి నుంచి వాటి నిర్వహణ బాధ్యత, ఆపరేటర్ల జీతభత్యాలు ఆయా పంచాయతీల మీద పడింది. ప్లాంట్ల నిర్వహణతో పాటు ఆపరేటర్ల జీతభత్యాలు ఏ పద్దు కింద చెల్లించాలో తెలియక చాలా పంచాయతీల్లోని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అలా పీలేరు పట్టణంలో ప్రస్తుతం నడుస్తున్న 25 ప్లాంట్ల ఆపరేటర్లు నాలుగు నెలలుగా తమకు జీతాలు లేవని వాపోతుండగా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తాము చెల్లించలేమంటూ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వాటర్ ప్లాంట్ల ఏర్పాటును తమ ప్రచార అస్త్రంగా మలుచుకున్న వైసీపీ నాయకులు వాటి నిర్వహణ, ఆపరేటర్ల జీతాలు వంటి అంశాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకపోవడంతో ఈ సమస్య నెలకొందని, ఆదాయం లేని చోట్ల నీళ్లను నామమాత్రపు ధరకు అమ్మాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు అధికారులు పెదవి విరుస్తున్నారు.

### వైసీపీ ప్రచార అస్త్రంగా ఆర్వో వాటర్ ప్లాంట్లు

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆరోగ్య ఆహార అలవాట్లలో భాగంగా గడిచిన దశాబ్ద కాలంగా ఆర్వో నీటి వినియోగం పెరిగింది. చిన్న చిన్న ఊళ్లలో సైతం ప్రైవేటు వ్యక్తులు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అంటూ క్యాన్ నీళ్లను విక్రయించేవారు. ఇదే అంశాన్ని 2019లో వైసీపీ తమ ప్రచార అస్త్రంగా మలుచుకుంది. ప్రజలకు సురక్షిత తాగునీరు అందివ్వడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని, తాము అధికారంలోకి వస్తే ఊరూరా ఉచితంగా ఆర్వో ప్లాంట్ల ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని పీలేరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు పెద్దఎత్తున ప్రచారం చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత తొలుత ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పార్లమెంటు నియోజకవర్గ ప్రాంత అభివృద్ధి నిధులతో పీలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు నిర్మించారు. కరోనా సమయంలో ఎంపీల నిధులకు అడ్డుకట్ట పడడంతో ఇచ్చిన హామీని నెరవేర్చుకునే క్రమంలో మేజర్ పంచాయతీల్లో పంచాయతీ నిధులతో వాటిని నిర్మించారు. చిన్న చిన్న గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నం కావడంతో ఏపీఎండీసీ సామాజిక బాధ్యత నిధులతో కొన్నింటిని నిర్మించారు. స్థానిక నాయకుల నుంచి డిమాండ్లు అధికం కావడంతో రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అధిక శాతం ప్రాంతాల్లో ప్లాంట్లను ఇబ్బడిముబ్బడిగా నిర్మించారు. నిర్మాణ సమయంలో ఆయా ప్లాంట్ల నిర్వహణను మూడేళ్ల పాటు ఏపీఎండీసీ ద్వారా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. ప్లాంట్ల నెలవారీ నిర్వహణతోపాటు వాటిల్లో పనిచేసే ఆపరేటర్లకు ప్రతి నెలా రూ.6200 జీతం, రూ.1300 పీఎఫ్ చెల్లించేవారు. ఆ క్రమంలో పీలేరు మండలంలోని పీలేరు పట్టణంలో దశల వారీగా 25 ప్లాంట్లు, వేపులబైలు, బోడుమల్లువారిపల్లె, బాలంవారిపల్లె పంచాయతీల్లో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఏపీఎండీసీ నిర్వహణ ఉన్నన్నాళ్లూ నీటిని ఉచితంగా అందజేశారు. 2024 మే మాసంలో ఆ బాధ్యతల నుంచి ఏపీఎండీసీ తప్పుకోవడంతో సమస్య ప్రారంభమైంది.

### జీతాల కోసం ఆపరేటర్ల ఎదురుచూపులు

2024 మే వరకు సాఫీగా జీతాలు అందుకున్న ఆపరేటర్లు ఆ తరువాత నెల నుంచి జీతం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పీలేరు పట్టణంలోని 25 ఆపరేటర్లు తమ జీతాల కోసం పంచాయతీ అధికారుల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఆ తరువాత సార్వత్రిక ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారడం, పీలేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరగడం, నిధులు దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలి అప్పటి ఈవో, సర్పంచ్ చెక్ పవర్ రద్దు కావడంతో వీరి కష్టాలు అధికమయ్యాయి. ఆయా ప్లాంట్లలో వైసీపీ సానుభూతిపరులనే ఆపరేటర్లుగా అప్పట్లో నాయకులు నియమించడంతో చాలామంది ప్రభుత్వం మారడంతో ఆ పని వదిలేసుకున్నారు. అలాంటి చోట్ల స్థానిక టీడీపీ నేతలు, పంచాయతీ అధికారులు కొత్త వారిని నియమించి ప్లాంట్లను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆపరేటర్ల జీతాలతో పాటు ప్లాంట్ల నిర్వహణ పంచాయతీ అధికారులకు కత్తి మీద సాములా మారింది. వాటర్ ప్లాంట్ల నిర్వహణ పంచాయతీ విధుల్లో లేకపోవడంతో ఆపరేటర్లకు ఏ పద్దు కింద జీతాలు చెల్లించాలో తెలియక వారు తలలు పట్టుకుంటున్నారు. తమకు జీతాలు లేవని పలువురు ఆపరేటర్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డిని ఆశ్రయించడంతో ఆయన గత ఏడాది అక్టోబరులో అందరికీ నెలకు రూ.6 వేలు చొప్పున మూడు నెలల జీతం ఇప్పించారు. అప్పటి నుంచి నేటి వరకు ఆపరేటర్లు జీతాల కోసం ఎదురుచూస్తూ పనిచేస్తున్నారు. పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి మండలాల్లో కొన్ని చోట్ల పంచాయతీల ఆధ్వర్యంలో ప్లాంట్లు నడుస్తున్నప్పటికీ వాటి నిర్వహణ కోసం ప్రజల నుంచి క్యాన్ నీటికి రూ.2 నుంచి రూ.5 దాకా వసూలు చేస్తున్నారు. ఆ డబ్బులతో ఆపరేటర్ల జీతం, ప్లాంట్ల నిర్వహణ చేస్తున్నారు.

### డీపీవో దృష్టికి జీతాల సమస్య

ఆర్వో ప్లాంట్ల ఆపరేటర్ల జీతాల అంశాన్ని పీలేరు పంచాయతీ ఈవో గురుమోహన్ గురువారం జిల్లా ఇన్‌చార్జ్ డీపీవో మస్తాన్‌వలీ దృష్టికి తీసుకెళ్లారు. జీతాల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకోవాలని, అనుమతులు వచ్చిన తరువాతనే వారిని జీతాలు చెల్లించగలమని ఆయన స్పష్టం చేశారు. అదే విషయాన్ని ఈవో గురుమోహన్ ఆపరేటర్లకు తెలియజేశారు. తాము ఇది వరకే జిల్లా పంచాయతీ అధికారికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే నిర్ణయం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఆర్వో ప్లాంట్లు ఎక్కడెక్కడ-ఎన్నెన్ని

పీలేరు మండలంలోని పీలేరు పట్టణంలో మొత్తం 25 వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటిలో ప్రస్తుతం నాలుగు ప్లాంట్లు సాంకేతిక కారణాలతో తాత్కాలికంగా మూతపడగా 21 పనిచేస్తున్నాయి. కలికిరి మండలంలోని కలికిరి పంచాయతీలో ఆరు, గుట్టపాళెంలో నాలుగు, రంగనాథపురంలో ఒకటి, మహల్, కొటాల, మేడికుర్తి పంచాయతీల్లో ఒక్కొక్క ఆర్వో వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో నిధుల కొరత కారణంగా గుట్టపాళెంలోని మూడు ప్లాంట్లు పనిచేయడం లేదు. మహల్ లోనూ పంచాయతీ నిర్వహించడం లేదు. మిగిలిన చోట్ల నడుస్తున్నాయి. గుర్రంకొండ పట్టణంలో మూడు ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మరో ప్లాంటు ప్రారంభమే కాలేదు. కలకడలో ఏర్పాటు చేసిన రెండు ప్లాంట్లూ ప్రస్తుతం పనిచేయడం లేదు. మరమ్మతుల కారణంగా అవి మూతపడ్డాయి. వాల్మీకిపురం మండలంలో మొత్తం 10 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని గాంధీపేట, గండబోయినపల్లెలోని ప్లాంట్లు ప్రస్తుతం మూతపడ్డాయి.



పీలేరు మండలం మేకలవానికాల్వ గ్రామంలో మూతపడిన ఆర్వో ప్లాంటు



వాల్మీకిపురం మండలం గండబోయినపల్లెలో మూతపడ్డ ఆర్వో ప్లాంటు

## క్వారీ సూపర్‌వైజర్ ఆత్మహత్య

బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫ్యానుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం బి.కొత్తకోట మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... మండలంలోని తుమ్మణంగుట్ట పంచాయతీ ముత్యాలరెడ్డిపల్లె వద్దనున్న ముత్యాలగడ్డ సమీపంలో క్వారీలో ప్రకాశం జిల్లా ఆలూరుకు చెందిన ఆవుల అభిలాష్ (32) ఆరేళ్ల నుంచి సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అక్కడే ఓ రూంలో ఉంటూ కంకర పనులను పర్యవేక్షించేవాడు. అతడి తండ్రి శ్రీనివాసులు ఇటీవల మృతి చెందాడు. తండ్రిని అమితంగా అభిమానించే అభిలాష్ డిప్రెషన్‌కు లోనయ్యాడు. తీవ్ర మనస్థాపంతో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఏఎస్ఐ బొజ్జేనాయక్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సిద్దవటం గ్రామ శివారులోని భాకరాపేట-సిద్దవటం మార్గంలో గ్రామానికి చెందిన రైతు చలపాటి రామసుబ్బయ్య (60) శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో పొలం వద్దకు వెళుతుండగా బెంగళూరు నుంచి వస్తున్న కారు ఢీకొంది. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు విచారణ చేస్తున్నారు. కారులో నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం జూకుంట గ్రామానికి చెందిన కొండలరావు, గీత, కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్నట్లు తెలిసింది

## పాఠశాల బస్సు, కారు ఢీ

చిన్నమండెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కడప- బెంగళూరు రహదారిలోని వండాడి క్రాస్ వద్ద శనివారం సాయంత్రం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు, కారు ఢీకొన్నాయి. రాయచోటి నుంచి చిన్నమండెం వైపు విద్యార్థులను తీసుకొస్తున్న బస్సు బెంగళూరు నుంచి రాయచోటి వైపు వస్తున్న కారును ఢీకొంది. ఆ సమయంలో స్కూల్ బస్సులో దాదాపు 50 మందికి పైగా విద్యార్థులున్నా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

## ప్రైవేటు ఫైనాన్స్‌లో రూ.20 లక్షల గోల్‌మాల్?

బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో పెద్ద స్కాం జరిగిందన్న వార్త శనివారం హల్‌చల్ చేసింది. కస్టమర్లు కుదువపెట్టిన బంగారాన్ని ఆ ఫైనాన్స్ సిబ్బంది తారుమారు చేసి సొంత అవసరాలకు వాడుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ బంగారు కుదువపెట్టిన వారు డబ్బు తెచ్చి తమ బంగారం ఇవ్వమని అడుగుతున్న వారికి సర్వర్ పనిచేయలేదు... నాలుగు రోజులు ఆగి రండి అని చెబుతున్నారని కొందరు, తాము పెట్టిన బంగారంలో కొన్ని వస్తువులు లేవు అంటున్నారని మరికొందరు చెప్పుకొచ్చారు. విషయం దావానలంలా పట్టణం అంతా వ్యాపించడంతో ఆ ప్రైవేట్ ఫైనాన్స్‌లో బంగారం కుదువ పెట్టిన కస్టమర్లు ఒక్కొక్కరుగా బ్రాంచి వద్దకు చేరుకున్నారు. తమ బంగారం ఇవ్వమని కొందరు, ఏమైందని మరికొందరు సిబ్బందిని నిలదీశారు. కాగా ఈ బ్రాంచిలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బంది రూ.లక్షల డబ్బును తమ సొంత అవసరాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు వాడేశారని, కంపెనీ ఆడిట్‌లో ఈ విషయం బయటపడినట్లు తెలుస్తోంది. కస్టమర్లు తమ బంగారు నగలు విడిపించుకోవడానికి వచ్చి నగదు చెల్లించినపుడు ఆ నగదును చేతికి తీసుకొని, ఆన్‌లైన్‌లో యాజమాన్యానికి జమ చేయకుండా డూప్లికేట్ రిసిప్ట్‌లు ఇచ్చి, ఆ మొత్తాన్ని వీరు పక్కదారి పట్టించినట్లు సమాచారం. ఆడిట్‌లో బయటపడటంతో ఆ సిబ్బందిపై చర్యలకు కంపెనీ పూనుకుంది. వీరిపై ఫిర్యాదు చేస్తారా? నగదును రికవరీ చేసి ఊరుకుంటారా అనేది తేలాల్సి ఉంది. బంగారు నగలపై ఎక్కువ రుణం ఇస్తారని వచ్చినందుకు తమకు ఎసరు పెట్టకుండా న్యాయం చేయాలని కస్టమర్లు కోరుతున్నారు.

## క్రికెటర్ శివకోటికి ఏఎస్పీ సన్మానం



శివకోటిని సత్కరిస్తున్న ఏఎస్పీ

నందలూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : బోర్డ్ ఆఫ్ డిజేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్‌లో నిర్వహించనున్న టీ20, వన్డే సిరీస్‌కు భారత జట్టుకు ఎంపికైన నందలూరు మండలవాసి ఏల్చూరి శివకోటిని ఏఎస్పీ మనోజ్ రాంనాథ్ హెగ్డే శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సత్కరించారు. ఆయన క్రీడా జీవితం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకోటి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో ముందుంటానని ఏఎస్పీ తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో
## అంగన్వాడీ కార్యకర్త మృతి



కవిత (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్త మృతిపై దేవపట్ల పంచాయతీ ఆవులవాండ్లపల్లెవాసులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు శనివారం మధ్యాహ్నం అంగన్వాడీ కార్యకర్త రెడ్డిమల్ల కవిత (43) కేంద్రంలోనే ఉరి వేసుకుని మృతి చెందింది. భోజనం నిమిత్తం ఇంటికి వెళ్లిన ఆయా తిరిగి వచ్చే సరికి ఆమె ఉరి వేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించి, స్థానికులకు సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఆమెను రాయచోటి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ భక్తవత్సలం ఆసుపత్రికి చేరుకొని మృతికి కారణాలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## మట్టి టిప్పర్లను అడ్డుకున్న ఎమ్మెల్యే

- విడిపించుకు వెళ్లిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు



మట్టి తరలిస్తున్న టిప్పర్, డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం మిల్లు వద్ద సిద్ధం చేస్తున్న లేఅవుట్‌కు అనుమతి లేకుండా మట్టితోలుతున్న టిప్పర్లను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అడ్డుకోగా, దీంతో ఆగ్రహించిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మట్టి టిప్పర్లను విడిపించుకు వెళ్లిన ఘటనతో మదనపల్లె రాజకీయ వేడి 'ఎమ్మెల్యే వర్సెస్ చినబాబు' అన్న రీతిన రాజుకుంది. రెండు నెలలుగా మదనపల్లె నియోజకవర్గంలోని టీడీపీ నేతలు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు వర్గాలుగా విడిపోయి, ఒక వర్గంపై మరొక వర్గం పరస్పరం విమర్శలు చేసుకోవడం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం చోటు చేసుకున్న సంఘటన ఈ వర్గాల మధ్య మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది. వివరాల్లోకి వెళితే...

మదనపల్లె మండలం సీటీఎం మిల్లు కొనుగోలు చేసిన వ్యక్తులు అక్కడ మిల్లు భవనాలను తొలగించి ఖాళీ అయిన 32 ఎకరాల భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం లేఅవుట్ సిద్ధం చేస్తున్నారు. ఈ లేఅవుట్‌ను చదును చేసేందుకు టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టి తోలుతున్నారు. ఈ క్రమంలో సీటీఎం గ్రామంలో ఓ లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేసేందుకు వెళుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎదుటకు మట్టి టిప్పర్లు వచ్చాయి. దీంతో వాటిని ఆపించిన ఎమ్మెల్యే మట్టి తోలేందుకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. అనుమతి లేకుండా అక్రమంగా మట్టితోలుతున్న వాహనాలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడికి చేరుకున్న వీఆర్‌వోలు మునస్వామినాయక్, కళ్యాణి టిప్పర్ డ్రైవర్ నుంచి తాళాలు తీసి పెట్టుకుని, మట్టితో వున్న టిప్పర్‌ను రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు సంఘటనా స్థలానికి వెళ్లి టిప్పర్లను అడ్డుకున్నది ఎవరంటూ ఆగ్రహించారు.

అంతేకాకుండా వీఆర్‌వో మునస్వామి, కళ్యాణిలను పిలిపించి వారి దగ్గర ఉన్న టిప్పర్ తాళాలను తీసుకుని టిప్పర్‌ను అక్కడి నుంచి పంపించి వేశారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మట్టి రవాణాకు అనుమతి దొరకలేదని, సోమవారం నిబంధనలు అనుసరించి మైనింగ్ ఏడీ నుంచి మట్టి రవాణాకు అనుమతి తీసుకుంటారని చినబాబు తెలిపారు. కాగా ఈ దృశ్యాలను అటు ఎమ్మెల్యే వర్గీయులు, ఇటు చినబాబు వర్గీయులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మదనపల్లె టీడీపీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు, శనివారం ఇద్దరు నేతలు వీధిలోకి రావడంతో ఒక్కసారిగా మంటలు రాజుకున్నట్లు అయ్యిందని ప్రజలు వాపోతున్నారు.

## బెంగళూరు టు హార్సిలీహిల్స్

### ఉల్లాసంగా..ఉత్సాహంగా యువత సైక్లింగ్



బి.కొత్తకోట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హార్సిలీహిల్స్‌కు శనివారం ఓ యువతీ, యువకుల బృందం సైకిళ్లపై వచ్చింది. బెంగళూరులోని పలు సైక్లింగ్ క్లబ్‌లు అప్పుడప్పుడూ ఇలాంటి ఈవెంట్లను నిర్వహిస్తుంటాయి. శనివారం ఉదయం 6 గంటలకు 60 మందితో కూడిన ఓ బృందం బెంగళూరులోని మెజిస్టిక్ నుంచి హార్సిలీహిల్స్‌కు బయలుదేరింది. హొస్కోట, చింతామణి, తాడిగోళ్ల క్రాస్, గౌనిపల్లె, బికొత్తకోట మీదుగా హార్సిలీహిల్స్‌కు మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకున్నా రు. సైకిళ్లకు అమర్చిన జీపీఎస్ చిప్ ద్వారా వా రి కదలికలను ఆర్గనైజర్లు అబ్జర్వేషన్‌లో పెట్టా రు. ఈ సందర్భంగా సైక్లింగ్ చేస్తూ వచ్చిన యువకులు మాట్లాడుతూ ఈ సైక్లింగ్‌తో మానసిక ఉల్లాసం, శరీరదారుఢ్యం పెంపొందుతుందన్నారు.

## 'పోక్సో' కేసులో పోలీసుల నిర్లక్ష్యం

- నిందితుడిని అరెస్టు చేయలేదు
- బాధితురాలి తల్లి ఆవేదన

పీలేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కలికిరి మండల పల్లవోలు పంచాయతీలోని ఓ గ్రామంలో 'పోక్సో' చట్టం కింద నమోదైన కేసులో కలికిరి పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితురాలి తల్లి వాపోయింది. కేసు పురోగతిపై శనివారం ఆమె పీలేరులో విలేఖరులతో మాట్లాడింది. గడి గ్రామానికి చెందిన వైసీపీ నేత జుబేర్ అహ్మద్ కుమారుడు జునైద్ అహ్మద్ గత నెల 23వ తేదీ రాత్రి తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. అదేరోజు తాము ఫిర్యాదు చేసినా కలికిరి పోలీసులు పట్టించుకోలేదన్నారు. చివరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి జోక్యంతో జనవరి 25న జునైద్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసినప్పటికీ నిందితుడిని అరెస్టు చేయడంలో గానీ, నిందితుడు వినియోగించిన వాహనాన్ని గానీ సీజ్ చేయలేదన్నారు. తాము ఆ సంగతి గురించి పలుమార్లు కోరినా కలికిరి సీఐ రెడ్డిశేఖరరెడ్డి దాటవేత ధోరణిలో సమాధానాలు చెబుతున్నారన్నారు. ఈలోపు నిందితుల బంధువులైన పల్లవోలు పంచాయతీ సర్పంచ్ బీబీ ఆయిషా భర్త ఇస్తియాక్ అహ్మద్, నిందితుడి సమీప బంధువు అయిన మునీర్ తమ ఇంటికే వచ్చి బెదిరించారన్నారు. నిందితుడిని అరెస్టు చేయకుండా తాము పోలీసులకు రూ.5 లక్షలు లంచం ఇచ్చామని, మీకు కూడా రూ.7 లక్షలు పరిహారం చెల్లిస్తామని, ఆ డబ్బు తీసుకుని రాజీకి పోవాలని బెదిరించారన్నారు. రాజీకి అంగీకరించకపోతే లారీలతో గుద్ది తనను, తన భర్తను చంపేస్తామని బెదిరించారన్నారు. వారు బెదిరించిన విషయాన్ని పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. నిందితుడు కలికిరి, గడి పరిసరాల్లోనే స్వేచ్ఛగా తిరుగుతున్నాడని తాము పలుమార్లు పోలీసులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదన్నారు. కేసును రాయచోటి డీఎస్పీ విచారిస్తున్నారని, ఆయన వచ్చి విచారణ చేసేంత వరకు తాము ఏమీ చేయలేమని ఆయన చెప్పారని వాపోయింది. ఇదే విషయాన్ని తాము ఇటీవల సంబేపల్లెలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో ఆయనకు వినతిపత్రం అందజేశామని, అప్పటి నుంచి తమకు బెదిరింపులు ఎక్కువైపోయాయన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు. తమ కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన జునైద్ అహ్మద్, తమను బెదిరించిన మునీర్, ఇస్తియాక్ అహ్మద్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని శనివారం పీలేరులో మైనారిటీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## మేకల చెరువు కబ్జా

- భూమిని చదును చేసి.. ఫెన్సింగ్ ఏర్పాటు
- ఇరిగేషన్‌శాఖ అధికారులు ఎక్కడ ?



మేకల చెరువు అన్యాక్రాంతం చేసి వెంచర్ వేసిన దృశ్యం

సిద్దవటం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లి పంచాయతీ పరిధిలోని మేకలచెరువును ఆక్రమించి చదును చేసి ఫెన్సింగ్ వేశారు. పునాదులు తీశారు. పశువులకు, వన్య ప్రాణులకు తాగునీటి వనరుగా ఉన్న చెరువును ఆక్రమించి సాగు చేస్తున్నా, కట్టడాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సాయికృష్ణ మాట్లాడుతూ మేకల చెరువు అన్యాక్రాంతం అంశాన్ని తహసీల్దారు మాధవీలత దృష్టికి తీసుకెళ్లగా సర్వే చేయిస్తామని, అన్యాక్రాంతమై ఉంటే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలియజేశారు.

# ప్రాణం తీసిన సరదా

## నీటిలో మునిగి ఇద్దరు నేపాలి యువకులు మృతి
## మృతులు హోటల్‌లో పనిచేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు



డ్యాం వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ, ఫైర్ సిబ్బంది



బినయ్ మృతదేహం - ఫైల్ ఫోటో



బీరేంద్ర మృతదేహం - ఫైల్ ఫోటో

వల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈదలేడేందుకు ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్దకు వెళ్లిన ఇద్దరు నేపాలి యువకులు బినయ్(22), బీరేంద్ర (30) నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకెళితే...

నేపాలీ యువకులు బినయ్, బీరేంద్ర చెన్నూరులో శివరాం ధమ్ బిర్యానీ హోటల్‌లో పనిచేస్తున్నారు. శనివారం హోటల్‌కు సెలవు దినం కావడంతో అక్కడ పనిచేసే సిబ్బంది సరదాగా ఈదలాడేందుకు ఆదినిమ్మాయపల్లె ఆనకట్టవద్దకు వచ్చారు. ఈ క్రమంలో వారిలో ఇద్దరు గల్లంతయ్యారు. విషయాన్ని పోలీసులకు తెలపడంతో సీఐ రోషన్ హుటాహుటిన డ్యాం వద్దకు చేరుకుని ఫైర్ సిబ్బందిని, స్థానిక జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి ఇద్దరు యువకులు మృతదేహాలు బయటికి తీశారు. కాగా మృతుల గురించి ఆరా తీస్తే బతుకుదెరువు కోసం నేపాల్ నుంచి వచ్చి శివరాం ధమ్ బిర్యానీ హోటల్‌లో కార్మికులుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరికి వివాహమైనట్లు తెలిపారు. సీఐ పూర్తి వివరాలు సేకరించి శవాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. డ్యాం వద్దకు వచ్చే పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోతాయని ఆయన హెచ్చరించారు.

## గండి ఘాట్‌లో ఇరుక్కుపోయిన లారీ, ఆర్టీసీ బస్సు



లారీ, బస్సు ఇరుక్కుపోవడంతో నిలిచిపోయిన వాహనాలు

చక్రాయపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గండి దేవస్థానం సమీప ఘాట్‌రోడ్డులో శనివారం సాయంత్రం లారీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా రావడంతో ఇరుక్కుపోయాయి. రెండు కొండల నడుమ రోడ్డు చాలా ఇరుకుగా ఉండడంతో రెండు భారీ వాహనాలు ఇరుక్కుపోయాయి. దీంతో దాదాపు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఇరుకైన ప్రదేశం కావడంతో ఏమాత్రం అజాగ్రత్త పడ్డ పాపాఘ్నిలో పడిపోవాల్సిందే. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదపు అంచులో ఇరుక్కుపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు కొంచెం ఓపిక పట్టి ఉంటే వాహనాలు ఇరుక్కుని ఉండేవే కాదన్నారు. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

## బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ హస్తం ?



స్వాధీనం చేసుకున్న వాహనం, చౌక బియ్యం బస్తాలు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చౌక బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ చోటా నేతల హస్తం కొనసాగుతోంది. అధికారం కోల్పోయినా ఇంకా వారి హవా నడుస్తోంది. తాజాగా పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో స్వాధీనం చేసుకున్న 70 బస్తాల చౌక బియ్యం అక్రమ రవాణాలో వైసీపీ చోటా నేతల ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో రేషన్ షాపు వద్ద బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున దాడి చేశారు. ఈ ఘటనలో బొలెరో వాహనం సహా 70 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ షాపు నుంచి బియ్యం తరలిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బొలెరో వాహనంతో, బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. సంఘటనపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన మహబూబ్‌బాష, మాబాషను పవర్ హౌస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. నజీరు, పటోడితో కలిసి బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నారని విచారణలో వెల్లడైందన్నారు.

## ఓటమి గెలుపునకు నాంది

### సాఫ్ట్‌బాల్‌లో కమలాపురం విద్యార్థులు విన్నర్స్



విజేతలుగా నిలిచిన కమలాపురం క్రీడాకారులు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అని, గెలుపోటములు సమానంగా స్వీకరించాలని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక డిగ్రీకళాశాలలో జరుగుతున్న అంతర్ కళాశాల క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించినప్పుడే క్రీడారంగంలో గుర్తింపు వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వినోద్‌కుమార్, కోఆర్డినేటరు వినయ్‌కుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పల్లాక్రిష్ణ, పీడీ అద్భుత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అలెఫ్‌లో 'ఒంటిచెయ్యి'కి చోటు

వేంపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా అలెఫ్ బుక్ కంపెనీ తీసుకొచ్చిన భారతదేశ వంద కథల పుస్తకంలో వేంపల్లె షరీఫ్ రచించిన 'ఒంటిచెయ్యి' కథను ప్రచురితం చేశారు. కేరళకు చెందిన ప్రఖ్యాత కవి, కేంద్ర సాహిత్య అకాడమీ వారి ఇండియన్ లిటరేట్ పత్రిక పూర్వ సంపాదకుడు ఏజె థామస్ ఉత్తమ కథల సంకలనం సంపాదకుడుగా వ్యవహరించారు. తెలుగు కవులు చలం, కవన శర్మ, సయ్యద్ సలీం, ప్రసిద్ధ భారతీయ రచయితలు రవీంద్రనాథ్‌ఠాగూర్, ప్రేమ్‌చంద్, శరత్‌చంద్ర చటర్జీ తదితరులు రచించిన కథలున్న ఈ పుస్తకంలో తన కథను ప్రచురించడం సంతోషంగా ఉందన్నారు. రాయలసీమలాంటి కథలకు ఆ పుస్తకంలో స్థానం లభించడం మరచిపోలేని జ్ఞాపకమని ఆయన అభిప్రాయపడ్డారు.

# దైన్యం... చివరి మజిలీ మార్గం

**అంతిమ కష్టాలు తీరేదెన్నడో ? ● కనీస సదుపాయాలకు నోచుకోని శ్మశాన వాటికలు**
**అంత్యక్రియలు చేసేందుకు వెళ్లాలన్నా అంతే... ● కర్మకాండలు ఇక ప్రశ్నార్థకమే....**



చిట్టడివిని తలపిస్తున్న 29వ వార్డు శ్మశాన వాటిక

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇది చిట్టడవి కాదు... చివరి మజిలీ(శ్మశానం).... అవును జీవితానికి చివరి మజిలీ చేరాలంటే ఎన్నో కష్టనష్టాలు అనుభవిస్తే తప్ప మార్గం సుగమం కాదనేది నగ్న సత్యం. ఇక్కడ చివరి మజిలీలో కనీసం మౌలిక సదుపాయాలు సైతం కరవయ్యాయని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తీసుకెళ్లాలన్నా తీరు తెన్నూ లేక ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు. దేహం విడిచిన ఆత్మకు శాంతి చేకూరాలంటే మృతదేహానికి శాస్త్రోక్తంగా ఉత్తర క్రియలు చేయాలి. అయితే మృతదేహాన్ని శ్మశానికి తీసుకెళ్లాలన్నా కుటుంబ, బంధు, మిత్రులు సైతం ఎన్నో కష్టాలను అనుభవించాల్సి ఉంటోంది. తర్వాత మూడో రోజు, ద్వాదశ కర్మలకు సైతం వెళ్లాల్సి వస్తోంది. ఇన్ని ఇక్కట్లను అనుభవించలేని కుటుంబ, బంధు, మిత్రులు నామమాత్రంగా కొద్ది మంది మాత్రమే వెళ్లి తంతు ముగించుకుని వస్తుంటారు. ఫలితంగా ఆత్మకు సరైతన శాంతి లభించదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. ఈ విషయాలను అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదంటే అతిశయోక్తి కాదు. ఇదీ పట్టణంలోని 29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశానవాటిక దీన స్థితి. వివరాల్లోకెళితే....

మున్సిపాలిటీ పరిధిలో 36వార్డుల్లో సుమారు 90 వేల పైచిలుకు జనాభా నివసిస్తుండగా మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం 12శ్మశాన వాటికలున్నాయి. వాటి అభివృద్ధి కోసం ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడంతో చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడం లేదు. కుమ్మరకొట్టాల వెనుకవైపు ఉన్న హిందూ శ్మశాన వాటికకు అంతిమ కష్టాలు తీరడంలేదు. ఏళ్ల తరబడి హిందూ శ్మశానవాటికలు ఎలాంటి అభివృద్ధికి నోచు కోలేదు. పేరుకే 12 శ్మశానవాటికలున్నా వాటి అభివృద్ధి కోసం ఎటువంటి నిధులూ మంజూరు కాకపోవడంతో చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడం లేదు. కొన్నిచోట్ల శ్మశాన వాటికలు కంపచెట్లతో నిండుకుని ఉండగా, మరి కొన్ని శ్మశానాలకు రహదారి సైతం లేదాయె. కొన్ని శ్మశానాలు సైతం కబ్జాదారుల కబంద హస్తాల్లోకి చేరాయి. ఇలా ఏ శ్మశానాన్ని చూసినా దయనీయ స్థితిలోనే దర్శనమిస్తున్నాయి. శ్మశానాల అభివృద్ధి కోసం అధికారులు, పాలకులు హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా 29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశాన వాటికలో పరిధిలో 6వేల జనాభా ఉన్నా ఎవరైనా మృతి చెందితే అంతిమ సంస్కారాలు చేద్దామంటే శ్మశానంలో కొలువైన సమస్యలు మరింత వేదనకు గురిచేస్తున్నాయి. శ్మశానమంతా కంపచెట్లతో కూరుకుపోయి, మురుగు నీరంతా శ్మశానంలోకి రావడంతో నడుముల్లోతు నీటిలోనే మృతదేహానికి అంత్యక్రియలు చేయాల్సి వస్తోంది. దీంతో శవం త్వరగా వాసన వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి చుట్టూ కంపచెట్లు అల్లుకుపోవడంతో మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. అనేక మార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసు కువెళ్లినా ఫలితం శూన్యం. ఎన్నికల సమయంలో రాజకీయ నేతలు ఓట్లకోసం శ్మశానాలను అభివృద్ధి చేస్తామని హామీలు ఇవ్వడం, గెలిచిన తరువాత పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంపచెట్లతో మూసుకుపోయిన శ్మశానవాటిక రహదారి

### అధికారులు, పాలకులు స్పందించాలి



29వ వార్డు కుమ్మరకొట్టాల హిందూ శ్మశాన వాటికలో 6వేల మంది జనాభా నివసిస్తున్నా శ్మశాన వాటికలో వసతులులేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శ్మశాన వాటికలో కంపచెట్లు విపరీతంగా పెరిగి కనీసం నీటి సౌకర్యం కూడా లేకుండా పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అనేకమార్లు అధికారులు, రాజకీయ నేతల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి.

*డి. విశ్వనాథనాయుడు, 29వ వార్డు*

### తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ఎవరైనా మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మృతదేహం పూడ్చేందుకు గుంత తీయాలన్నా కంపచెట్లు తొలగించాలి, ఇక్కడకు చేరిన మురుగునీరంతా తొలగించాలి. చేరి ఉండడంతో మృతదేహాన్ని అక్కడే ఖననం చేయాల్సిన దుస్థితి ఉంది. రహదారి అంతా కంపచెట్లతో మూసుకుపోవడంతో చాలా కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కంపచెట్లను తొలగించాలి.

*బద్రి, 29వ వార్డు*

## గండి నిత్యాన్నదానానికి లక్ష విరాళం



దాతకు రసీదు అందిస్తున్న ఈఓ, అర్చకులు

చక్రాయపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం పాలెంపల్లె భక్తుడు మేకల హనుమంతయ్య, కుమారుడు ఆంజనేయులు రూ.1,00,116 విరాళాన్ని సమర్పించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి ఆశీర్వచనాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, అర్చక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం

గండి వీరాంజనేయస్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రెండో శనివారం, భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామివారి దర్శనానికి భారీఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లలో రద్దీగా కనిపించారు. భక్తులు పాపాఘ్నిలో స్నానాలాచరించి అంజన్నను దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం రూ.4,62,096 ఆదాయం వచ్చింది.

## రేపు లాటరీ ద్వారా షాపుల ఎంపిక

కడప క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ జిల్లా గీత కులాల కోసం మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియను లాటరీ విధానం ద్వారా నిర్వహించనున్నట్లు కడప జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తెలిపారు. లాటరీ ప్రక్రియను కలెక్టరు అధికారికంగా నిర్వహించనున్నారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తారన్నారు. పూర్తివివరాలతో సమర్పించిన దరఖాస్తు కాపీలు,నాన్ రీఫండబుల్ దరఖాస్తు రుసుం చలానా, లావాదేవీ పూర్తయిన నిర్ధారణగా, లాటరీ హాలులో ప్రవేశించేందుకు అవసరమైన పాస్, ఏ3-బీ ఫారం దరఖాస్తుదారుల గుర్తింపు, ఇతర వివరాల పరిశీలన కోసం, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, తహసీల్దార్లు జారీ చేసిన అదనపు (సప్లిమెంటరీ) ఉప కులధ్రువీకరణ పత్రం చూపాలన్నారు. అభ్యర్థులు లాటరీ ప్రక్రియకు ఉదయం 8గంటల్లోపు సభాభవన్‌లో హాజరవాలి. అభ్యర్థులు తమ పత్రాలను ముందుగా సిద్ధం చేసుకుని లాటరీ అన్ని నిబంధనలు పాటించాలి. లాటరీ ప్రాసెస్ పూర్తయిన అనంతరం ఎంపికైన అభ్యర్థులకు వెంటనే తగిన మార్గదర్శకాలు ఇవ్వబడతాయి.

## లిఫ్ట్ పేరుతో చోరీలు : డీఎస్పీ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంలో వెళుతూ బస్సు, ఆటో కోసం ఎదురుచూస్తున్న వారికి లిఫ్ట్ ఇస్తామని చెప్పి దారిలో వారిని కొట్టి డబ్బులు, బంగారు ఎత్తుకెళుతున్నారని డీఎస్పీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు నిందితుల అరెస్టును చూపిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వరుస దోపిడీలకు పాల్పడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ముగ్గురు సభ్యుల అంతర్‌జిల్లా దోపిడీ దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే పొన్నతోట జయచంద్ర రిమాండ్‌లో ఉండగా ప్రస్తుతం నాగరాజు, వెంకటరమణను అరెస్టు చేశామన్నారు. నాగరాజు ద్విచక్ర వాహనంలో వెళుతూ వాహనాల కోసం ఎదురుచూస్తున్న వారిని లిఫ్ట్ ఇస్తామని చెప్పి దారిలో వారి వద్ద నుంచి డబ్బులు, బంగారు ఎత్తుకెళుతున్నాడన్నారు.

## ఆటోడ్రైవరు నిజాయితీ



కడప క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పై వంద రూపాయల నోటు కళ్లబడితే అటు ఇటు చూసి చటుక్కున జేబులో వేసుకుని వెళుతున్న కాలంలో తన ఆటోలో మరిచిపోయిన నగదు, ఏటీఎం కార్డులున్న బ్యాగును పోలీసులకు అప్పగించాడు. ఎన్జీవో కాలనీ మహిళ మోర్ సూపర్‌మార్కెట్ దగ్గర ఆటో ఎక్కి ఓంశాంతినగర్ వద్ద దిగింది. అయితే తన హ్యాండ్‌బ్యాగ్ ఆటోలోనే మరిచిపో యింది. కొంత సేపటికి విషయం గమనించిన ఆటోడ్రైవరు రవిశంకర్ బ్యాగును చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో అప్పగించాడు. సదరు బ్యాగును పోలీసులు పరిశీలించగా ఏటీఎం కార్డులు, కొంత నగదు, సెల్‌ఫోన్ ఉన్నాయి. వెంటనే పోలీసులు ఆ మహిళను స్టేషన్‌కు రప్పించి ఆటోడ్రైవరు సమక్షంలో బ్యాగును అప్పగించారు. చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్ డ్రైవరును అభినందించారు.

## మహిళ ఆత్మహత్య

చాపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాళెం గ్రామంలో శనివారం వరలక్ష్మి (28) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వరలక్ష్మికి ముగ్గురు ఆడ పిల్లలు పుట్టినందున ఆమెను భర్త వేధించేవాడన్నారు. కొన్ని నెలలుగా భర్త వేధింపులు భరించలేక మాత్రలు మింగిందని వరలక్ష్మి తల్లి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

## కొండకు ఆకతాయిల నిప్పు

### కాలిపోయిన పాలీషీట్, పీవీసీ పైపులు



కాలిపోయిన ఫారమ్ పాండ్ పాలీషీట్

లింగాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొండకు ఆకతాయిలు శుక్రవారం రాత్రి అగ్గిపెట్టడంతో లింగాల వాసి కుమ్మెత రామాంజనేయరెడ్డి ఫారమ్ పాండ్ పాలీషీట్, 25పీవీసీ పైపులు, 30 స్ప్రింక్లర్స్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. దీంతో రైతుకు సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. కొండకు దిగువన తోట ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## 'కృష్ణా' కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలి

### కాంగ్రెస్ నేత తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో ఏర్పాటు చేయాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. రాయలసీమలో ఉన్న శ్రీశైలం జలాశయానికి సమీపంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. మంత్రులకు ర్యాంకింగ్ ఇవ్వడం సెల్ఫ్‌గోల్‌తో సమానమన్నారు. ర్యాంకింగ్‌లో ముఖ్యమంత్రికి 6వ ర్యాంకు, లోకేష్‌కు 8, పవన్‌కు 10వ ర్యాంకు ద్వారా ప్రజల్లో, కార్యకర్తల్లో మిగతా మంత్రుల్లో వారిపట్ల చులకన భావం వస్తుందన్నారు.

## వసతి గృహాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వెల్ఫేర్ డైరెక్టర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహాలను వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకులు ఎ.మల్లికార్జున శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మెనూ ఏ విధంగా అమలవుతోందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మూమెంట్ రిజిస్టర్ నిర్వహించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. ఎంఆర్ శంకరన్ నాలెడ్జి కేంద్రాలు బీసీ వసతి గృహాల్లో ఏర్పాటు చేయబడిందని వాటిని వినియోగంలోకి తీసుకు వచ్చి విద్యార్థులు వినియోగించుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బీసీ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.55లక్షలు కేటాయించిందని ఈ మాసాంతానికి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.

## కమలాపురంలో వివాహిత అదృశ్యం



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రాస్‌రోడ్డు నివాసం ఉంటున్న వివాహిత పేర్ల భార్గవి (32) శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ భార్గవి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లిందని, ఆటోలో కడప వైపునకు వెళ్లినట్లు వారు తెలిపారన్నారు. భార్గవి ఇంటి నుంచి బయటికి వెళ్లే సమయంలో బ్లూకలర్ డ్రెస్ ధరించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121100532, 9121100529 నెంబర్లకు తెలియజేయాలని, కేసు నమోదు చేశామన్నారు.

## బ్రహ్మం మృతిపై నిజాన్ని వెల్లడించాలి



మాట్లాడుతున్న వనబాక శివలక్ష్మి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ఇటుకల బట్టీలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వనబాక బ్రహ్మం మృతిపై నిజాలు వెల్లడించాలని మృతుడి సోదరి వనబాక శివలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 7వ తేదీ ఉదయం 6.30 గంటలకు ఇటుకల బట్టీ యజమాని 'మీ అన్న ఉరి వేసుకుని చనిపోయాడని' ఫోన్ ద్వారా సమాచారం అందించాడన్నారు. ఆత్మహత్య చేసుకుంటే సంఘటనా స్థలంలో పోలీసు విచారణ, పంచానామా చేయకుండా మృతదేహాన్ని ఆస్పత్రికి ఎలా తరలించారని ఆమె ప్రశ్నించారు. ఆస్పత్రిలో మృతదేహాన్ని చూడటానికి కూడా కుటుంబీకులను అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన సోదరుడు మృతిపై అనుమానం ఉందని, ఈ సంఘటనపై పోలీసుల తీరు అనుమానాస్పదంగానే ఉందన్నారు. సంఘటన స్థలంలో సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, పోస్టుమార్టం, ఫోరెన్సిక్ రిపోర్టులను తారుమారు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో వనబాక సంధ్యావలి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## బీజేపీ విజయంపై మిన్నంటిన సంబరాలు



కడపలో బీజేపీ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న వెంకటసుబ్బారెడ్డి, సింగారెడ్డి, చలపతి, తదితరులు



కర్రసాము చేస్తున్న సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దాదాపు 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాదించడంపై ఆ పార్టీ సంబరాలు మిన్నంటాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జె.వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్‌జీవో కాలనీ వాజ్‌పేయి సర్కిల్‌లో సంబరాలు జరుపుకున్నారు. టపాసుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందంగా చిందేశారు. మువ్వన్నెల జెండాను చేతపట్టుకుని నృత్యాలు చేశారు. కేంద్ర పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు జె.వెంకటసుబ్బారెడ్డి డ్రమ్స్ వాయించారు. సింగారెడ్డి కర్రసాము చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్, నాయకులు మునగా సతీష్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**పులివెందులలో ఉత్సవాలు ...**



ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

పులివెదుల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఢిల్లీలో విజయం సాధించడంతో పులివెందులలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ప్రభుత్వం అవినీతితో కూరుకుపోవడం వలన ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన గుర్తు చీపురుతోనే ఆమ్‌ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలు ఊడ్చేశారన్నారు. కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వర్‌రెడ్డి, భానుప్రకాష్, వైనవీన్, శ్రీరాములు, రమనారెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, లక్ష్మయ్య, వాజ్‌పేయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వేంపల్లె:** వేంపల్లెలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ అఖండ విజయం కోసం కృషిచేసిన ప్రధాన మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా, ఢిల్లీ బీజేపీ నేతలకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలు హర్షిస్తున్నారన్నారు.

**కమలాపురం రూరల్ :** కమలాపురం పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శివకిశోర్‌రెడ్డి బీజేపీ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంతి, విజయభాస్కర్, ఓబయ్య పాల్గొన్నారు.

**చెన్నూరు :** స్థానిక కొత్తరోడ్డులో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర బీజేపీ కర్యావర్గ సభ్యుడు మాదినేని రామసుబ్బయ్య, నాయకులు అతికారి రవికుమార్, రెడ్డి ప్రసాద్, మునిసుబ్బారెడ్డి, సి.చిన్నపరెడ్డి, పెడబల్లె సరోజనమ్మ పాల్గొన్నారు.

## మా పిల్లలను మరో పాఠశాలకు మారిస్తే ఊరుకోం

- కొండపేట ఉర్దూ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

చెన్నూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఉర్దూ పాఠశాలలో చదివే విద్యార్థులను పాఠశాలల మెర్జ్ అనే కారణంతో మరో పాఠశాలకు మార్చాలని చూస్తే ఊరుకోబోమని కొండపేట ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద పంచాయతీలో ఉన్న ఈ పాఠశాలను మరింతగా అభివృద్ధి చేయాల్సింది పోయి ఇలా విద్యార్థులను మారిస్తే ఎలా అని ప్రశ్నించారు. 2020లో కొండపేటలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చారు. మండలంలో చెన్నూరు తరువాత కొండపేటనే పెద్ద గ్రామ పంచాయతీ. అందులో ఉర్దూ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఉర్దూ పాఠశాలను ఇప్పుడు ఉన్నత పాఠశాలగా మార్చాల్సిన సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థులను మరో చోటికి మారిస్తే వారికి అన్నిరకాల ఇబ్బందులేనని తల్లిదండ్రులు చెబుతున్నారు. పైగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు విద్యార్థులు వెళ్లే సమయంలో కిలోమీటరు నుంచి 3 కిలోమీటర్ల లోపు నదులున్నా, లోలెవల్ కాజ్‌వేలున్నా, వంతెనలు ఉన్నా ఆ దారిలో వెళ్లేందుకు నిబంధనలు వర్తించవని గుర్తు చేశారు.



కొండపేట ఉర్దూ పాఠశాలను మెర్జ్ చేస్తే విద్యార్థులు వెళ్లాల్సిన దారి ఇదే...



కొండపేటలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల

### వంతెనపై ప్రమాదాలు



విద్యార్థులు వంతెన మీదుగా వెళ్లాలి. ఇది హైలెవల్ వంతెన. నిత్యం ఆ దారిలో వాహనాలు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అతివేగంగా తిరుగుతుంటారు. అల్లరిమూక లు కూడా ఎక్కువగా ఉంటారు. అలాంటి సమయంలో వారు పాఠశాలకు ఎలా వెళతారు.

**- నౌషాద్‌బేగం, స్కూలు కమిటీ వైస్ చైర్‌పర్సన్**

### ఆ దారిన వాహనాలు వేగంగా వెళుతుంటాయి

విద్యార్థులు వెళ్లి వచ్చే సమయంలో ద్విచక్ర వాహనాల వేగం కూడా వంతెనపై ఎక్కువగా ఉంటుంది. ర్యాష్ డ్రైవింగ్ చేసేవారు మరీ ఎక్కువ. ఇటీవల ప్రమాదాలు కూడా జరిగాయి. ఒకవేళ అలాంటి ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏమిటి. దానికి ఎవరు బాధ్యత. కావున విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని మార్చే ఆలోచన మానుకోవాలి.

**- రిహానా, విద్యార్థి తల్లి**

### వంతెనపై ఆకతాయిలు ఎక్కువ

8వ తరగతి చదివే పిల్లలు ఇప్పుడిప్పుడే మెచ్యురిటీ స్థాయికి వెళుతుంటారు. అలాంటప్పుడు వంతెనపై వెళ్లి వచ్చేటప్పుడు అక్కడ పనీపాట లేకుండా తిరిగే ఆకతాయిల వల్ల ఇబ్బందులు జరిగితే ఎవరిది బాధ్యత. ఇటీవల పత్రికల్లో చూస్తున్నాం. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి, కావున అధికారులు ఈ విషయంలో మరో మారు ఆలోచించాలి.

**- షరీఫున్, విద్యార్థి తల్లి**

### చలి, ఎండాకాలంలో ఇబ్బందే...



విద్యార్థులు కొండపేట నుంచి చెన్నూరుకు వెళ్లాలంటే కిలోమీటరుకు పైగా దూరం ఉంది. ఈ మధ్యన వంతెన ఉంది. ఆడపిల్లలు పైగా చిన్నపిల్లలు, కొండపేట నుంచి కిలోమీటరు పై దూరం ఉన్న చెన్నూరు పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న సమయంలో రావాలంటే ఎంత ఇబ్బంది. ఆ మాత్రం విద్యాశాఖ అధికారులకు తెలియదా. కావున విద్యాశాఖాధికారులు ఆలోచన చేయాలి. లేదంటే మా పిల్లలను మరోబడికి పంపం. ఇక్కడ ఉంటేనే చదివిస్తాం, లేదంటే లేదు.

**- మాబుచాన్, జరీనా,**

### తల్లిదండ్రులు ఒప్పుకుంటేనే మెర్జ్ ఉంటుంది



విద్యార్థుల తల్లిదండ్రులు ఒప్పుకుంటేనే విద్యార్థులను మరోచోటికి మార్చే బాధ్యతను విద్యాశాఖ తీసుకుంటుంది. వారు ఒప్పుకోకుంటే లేదు. ప్రస్తుతానికి ఈ విద్యాసంవత్సరానికి విద్యార్థులను మార్చరు. ఏదిఏమైనా విద్యార్థుల నిర్ణయమే ఫైనల్. కాకపోతే ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. వారిని బయట దూరంగా ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా మంచి విద్యను బోధించే ఈ కొండపేట పాఠశాలలోనే చేర్పించాలి.

**- షకీలా, ప్రధానోపాధ్యాయురాలు**

### ఉన్నతాధికారులతో మాట్లాడతా



కొండపేటలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులను మరోచోటికి తరలించకుండా చూస్తాం. నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఈ పాఠశాల కోసం ఎంతో కృషి చేశా. ఇప్పుడు ప్రాథమికోన్నత పాఠశాలలో 28 మంది విద్యార్థులు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో తరగతికి 20 మంది ఉండాలి. ఆ విధంగా ఉండేలా ప్రయత్నం చేస్తాం. ఇప్పటికే ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారికి విషయం తెలిపాం. తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దు.

**- మన్నె మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కొండపేట**

## 'ఉర్దూ స్కూళ్లపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు'

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ స్కూళ్లపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిలో వ్యవహరిస్తోందని వైసీపీ మైనార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కడప నగరం మాజీ ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో మైనార్టీ నగర అధ్యక్షుడు షఫి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అధికార భాషగా ఉన్న ఉర్దూను వాట్సాప్ గవర్నెన్స్‌లో పెట్టకపోవడం కూటమి ప్రభుత్వం కుటిల నీతికి నిదర్శనమన్నారు.

కడప నగరంలో 13 ప్రైమరీ స్కూల్స్ 5 యూపీ స్కూల్లు, 4 ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉన్నాయన్నారు. ఈ పాఠశాలలను వేరే స్కూళ్లల్లో కలపడానికి ప్రయత్నాలు చేయడ సబబు కాదన్నారు. అంతేకాకుండా కడప జిల్లాలో ప్రాథమిక స్కూల్ 101 ప్రాథమిక ఉన్నత స్కూల్లో 30 ఉన్నత స్కూల్లో 25 మొత్తం కలిపి 156 ఉర్దూ స్కూళ్లు ఉన్నాయన్నారు. జీఓ నెంబర్ 117ను రద్దుచేసి కొత్త జీఓ తీసుకొచ్చి మైనారిటీల ఉర్దూ భాష పైన వేటు వేసేందుకు ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు.

## ప్రజలకు మరింత చేరువగా అర్జున్ హాస్పిటల్

- మల్టీ స్పెషాలిటీ.. అత్యాధునిక సౌకర్యాలు
- ఏప్రిల్ వరకు చికిత్సల్లో 50 శాతం రాయితీ
- అర్జున్ హాస్పిటల్ ఎండీ అవ్వారు అర్జున్

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలనే లక్ష్యంతో కడప నగరం కో-ఆపరేటివ్ కాలనీలో అవ్వారు అర్జున్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేశామని ఆ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అవ్వారు అర్జున్ అన్నారు. అవ్వారు అర్జున్ తండ్రి, బీసీ మహాసభ జాతీయ కన్వీనర్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, ఆయన సతీమణి అవ్వారు రమాదేవి హాజరై ప్రారంభించారు. అనంతరం జనరల్ మెడిసిన్ ఎం.డి, సీనియర్ ఫిజీషియన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ అవ్వారు అర్జున్ మాట్లాడారు. అత్యాధునిక వసతి, సౌకర్యాలతో హాస్పిటల్‌ను ప్రజలకు మరింత చేరువగా ఉండేలా ఏర్పాటు చేశామన్నారు.



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న అవ్వారు మల్లికార్జున

ఇందులో ప్రధానంగా జనరల్ మెడిసిన్, గైనకాలజీ, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, తదితర వైద్యసేవలు అం దుబాటులో ఉన్నాయన్నారు. అంతేకాకుండా పీడియాట్రిక్, ఆర్థోపెడిక్స్ మోకాలి మార్పిడి, ఫిజియోథెరపీ సేవలు కూడా అందిస్తామ న్నారు. 24 గంటల పాటు అత్యవసర వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక ఐసీయూ, ఐసీయూ, ఉన్నాయన్నారు. డిజిటల్ ఎక్స్‌రే, ఫార్మసి, ల్యాబ్, స్పెషల్ రూమ్స్ ఉన్నాయన్నారు. జనరల్ మెడిసిన్‌కు తాను, గైనకాలజీకి డాక్టర్ శిరీష, అలా గే చిన్నపిల్లలకు డాక్టర్ జి.నరసింహమూర్తి వైద్యం అందిస్తామన్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎల్.ఆనంద్, స్కిన్ స్పెషలిస్టు డాక్టర్ సుష్మ, ప్రముఖ జనరల్ సర్జన్ ఎం. రసజ్ఞ చౌదరి చికిత్స అందిస్తారన్నారు. అలాగే 3 నెలల పాటు అన్ని చికిత్సల బిల్లులపై 50 శాతం రాయితీ ఉందన్నారు. ఐసీయూలో ప్రత్యేక ఇన్‌సెట్విప్‌లు ఉంటారన్నారు. అధునాతన లేజర్ సర్జరీలు అతి తక్కువ ఖర్చుతో చేస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం 6305800108, 81421 88108కు సంప్రదించాలన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీష రాటాల, క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పుష్పగిరి వద్ద కొండపై అన్నదానం

వల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో దేవదాయ ఉప కమిషనరు ఆదేశాలు, కలెక్టరు ఉత్తర్వుల మేరకు కొండపై గల లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఎండోమెంటు డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో ప్రతి శనివారం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఈవో శ్రీనివాసులు తెలిపారు. కావున భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## 'ఏఎన్ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయకపోతే ఆందోళన'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఏఎన్ఎం పోస్టుల నియామక నోటిఫికేషన్ తక్షణం విడుదల చేయాలని, జాప్యం చేస్తే రాష్ట్ర వ్యాపితంగా ఆందోళనకు సిద్ధమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎన్ఎం పూర్తి చేసి ఏ ఉద్యోగమూ రాక వయోపరిమితి మీరిపోతుందనే మానసిక ఆందోళనలో అభ్యర్థులున్నారని, కావున తక్షణమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. దీనిపై అనేక ఉద్యమాలు, ఆందోళనలు, చేపట్టినప్పటికీ పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. ఏఎన్ఎం పూర్తిచేసి ఆశాలుగా పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ శాంతమ్మ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA.
O.S. No. 238/2016

Shaik Bepari Mahaboob Basha @ Shaik Bepari Basha, S/o Shaik Bepari Abdul Khader, aged about 43 years, Tailor, resident of D.No.2/1043, Sreehari Rao Veedhi, Nagarajupet, Kadapa City, represented by the Special Power of Attorney Holder smt. S.B. Basheerunnisa @ Kousar Banu. ... Plaintiff

Versus

1. Shaik Bepari Mohammed Ghouse S/o Shaik Bepari Abul Khader, aged about 32 years, Muslim, Business, residing at D.No. 8/137-2-1,Ravindra Nagar, Chemmumiyapet, Kadapa City. ...1st Defendant

NOTICE TO 1st DEFENDANT

Whereas the above plaintiff filed the above suit against the defendants for specific performance and the said suit stands posted to 20/2/2025 for cross of the plaintiff by the defendants. The 1st defendant has to appear before the Hon'ble Court on 20/02/2025 at 10.30 AM and to cross examination the plaintiff. If the 1st defendant fails to appear, the matter will be decided ex-parte.

Advocate for the Plaintiff
K. KRISHNAMURTHY, B.A., B.L.
Advocate, Kadapa. Cell : 80082 29351

## భయాందోళనలు రేపుతున్న పులుల సంచారం

లింగాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామసముద్రం గ్రామంలో పెద్దపులి, మూడు పులిపిల్లలు చూసినట్లు గ్రామానికి చెందిన మిద్దె ఆదినారాయణ తెలియజేయడం ప్రజల్లో భయాందోళనల రేపుతోంది. ఈ విషయమై తహసీల్దార్ ఈశ్వరయ్య మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం ఆదినారాయణ తన పొలం వద్దకు వెళ్లగా పెద్దపులి, మూడు పులి పిల్లలు చూసినట్లు తమకు తెలియజేశాడన్నారు. అటవీ అధికారులకు విషయం తెలియజేశామని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పొలాల్లో సంచరించే సమయంలో కర్రచేత పట్టుకొని తిరగాలని ఆయన సూచించారు.

## కనీస వేతనం ఇవ్వాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న ఆయాలకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక హోచిమిన్ భవన్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాల సమావేశం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వేణుగోపాల్, నాగసుబ్బారెడ్డి మాట్లాడారు.

## ఆర్థిక అంశాలపై ఉద్యోగ సంఘాలతో చర్చించాలి

- ఎస్‌టీయూ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా



మాట్లాడుతున్న ఇలియాస్ బాషా

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంఘాలతో చర్చించాలని కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా డిమాండ్ చేశారు. శనివారం కడప ఎస్టీ యూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెలలో ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్లో కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ప్రకటించిన ఎన్నికల హామీలకు సంబంధించిన నిధులను కేటాయించాలని, ముందుగా ఉద్యోగ సంఘాలను ఆర్థిక అంశాలపై చర్చలకు ఆహ్వానించాలన్నారు. ఈ కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలను పెట్టుకున్నారన్నారు. గడిచిన ఐదున్నర సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులు జీతం తప్ప ఒక్క రూపాయి కూడా బకాయిలను పొందే అవకాశం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి 8 నెలల సమయం ఇచ్చారని ఉద్యోగ ఉపాధ్యాయుల సహనం లోపించక ముందే వారు ఉద్యోగ దారి పట్టకముందే ఈ బడ్జెట్‌లో న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు, బాలగంగిరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి జి. రామమోహన్, నగర శాఖ నాయకులు సాదిక్, రాజగోపాల్ రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.





## విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలగాలి : డీఎస్పీ



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ మురళీ నాయక్

సింహాద్రిపురం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో క్రమ శిక్షణతో మెలగాలని పులివెందుల డీఎస్పీ మరళీ నాయక్ సూచించారు. శనివారం సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేసి అనంతరం సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. మండలంలో గ్యాంబ్లింగ్, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చెట్లు నాటే కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొన్నారు. అనంతరం బిదినంచెర్ల గ్రామంలో ఇటీవల అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఎల్లప్పగారి పార్వతమ్మ ఇంటి పరిసరప్రాంతంలో డీఎస్పీ పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పులివెందుల సీఐ వెంకటరమణ, సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదిగల చరిత్రను సమాజానికి తెలియజేస్తాం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):మాదిగల చరిత్ర, పుట్టు పూర్వోత్తరాలను సమాజానికి తెలియజేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కాశీపట్టణంలో చర్మకార వృత్తిలో జన్మించి నేడు దైవంగా పూజింపబడుతున్న శ్రీసంత్ రవిదాస్ జయంతిని మాఘమాసం పౌర్ణమి సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్సవాలను జరుపుకుంటారన్నారు. ఒంటిమిట్టలో ఆది జాంబవ ధర్మ రక్షా సమితి, ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12న కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ ఉత్సవాలకు మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ ఎంఎస్ రాజు, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, మాతంగ మహాపీఠాధిపతులు రవీంద్రస్వామి పాల్గొంటారన్నారు.డప్పు, చర్మకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, దళితవాది రామాంజనేయులు పాల్గొన్నారు.

## ఆప్కాస్‌లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఆప్కాస్‌లో చేర్పించిందని తెలిపారు. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దు చేయాలని తీర్మానించారని, దీనితో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తారని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్‌పాల్గొన్నారు.

### కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

బద్వేలు, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ సంస్థను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ కమిటీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె. నాగేంద్రబాబు అన్నారు.శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యామ్ ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు నేలటూరి పాలయ్య, కోశాధికారి కె.శివకుమార్, కమిటీ సభ్యుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలకు పాదయాత్ర ప్రారంభం



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు ప్రొద్దుటూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. శనివారం ఉదయం 7 గంటలకు టీటీడీ కల్యాణ మండపం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకుడు వంగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో 500 మంది భక్తులతో పాదయాత్ర ప్రారంభమైంది. ఈ పాదయాత్రను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ప్రారంభించారు.అల్పాహారం అనంతరం కాలినడకన భక్తులు తిరుమలకు బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ,రాజుపాళెం మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ గంజికుంట ఆంజనేయులు, జంబాపురం రామాంజనేయరెడ్డి, మాజీ శివాలయం ఛైర్మన్ పల్లా శంకర్‌నారాయణ, గంటశాల వెంకటేశ్వర్లు, రసూల్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, వారికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఆదుకొంటామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ప్రమాదాలలో,అనారోగ్యంతో ఆసుపత్రిపాలై డబ్బులు ఖర్చు చేసుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారికి ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ 38 మందికి సుమారు 70 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు యాపరాల చిన్న, బండి అమర్‌నాథ్,అన్నవరం సుధాకర్‌రెడ్డి,పాలమాబు తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాతను నిండా ముంచిన శనగ..!

● రైతన్న శ్రమ నేలపాలు ● దిగుబడి తగ్గడంతో రైతన్నల్లో ఆందోళన



దెబ్బతిన్న శనగ పంట

ముద్దనూరు ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉంది.పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి రైతన్నను నిరాశకు గురిచేస్తుంది.పంట దెబ్బతిని, దిగుబడి తగ్గిపోవడంతో రైతన్నల పరిస్థి దయనీయంగా మారింది. వివరాల్లోకి వెళితే...మండలంలో రబీ సీజన్‌లో రాజులగురువాయపల్లె, నల్లబల్లె, వేల్పుచర్ల, పెనికెలపాడు, మంగపట్నం గ్రామాల్లో శనగ పంట విస్తారంగా సాగు చేస్తారు.దాదాపు 2,548 ఎకరాల్లో పంటసాగు చేశారు.కానీ సకాలంలో వర్షాలు పడిన పూత, మొగ్గ దశలో తుపాన్, పొగ మంచు(మొగిలి)ప్రభావంతో శనగ పూర్తిగా దెబ్బతింది.రైతులు సేద్యం నుంచి విత్తనాల కొనగోళ్లు, ఎరువుల, పురుగుల మందు, పంట కోత వరకు దాదాపు ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు శనగ పంట సాగుకు ఖర్చు చేశారు. కౌలు రైతుకు అదనంగా భారం పడుతుంది.పంట పూర్తిగా దెబ్బతినడంతో పంట దిగుబడి భారీ తగ్గి పోయింది.ఎకరాకు 6నుంచి7 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 2నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి మాత్రం వస్తుంది.గిట్టుబాటు ధర కూడా లేదని, క్వింటా దాదాపు రూ.5,500 మార్కెట్‌లో ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.పొలాల్లోనే శనగ పంట యంత్రాలతో నూర్పిళ్లు చేస్తున్నారు. శ్రమ నేలపాలు కావడమే కాక పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదని రైతులు,కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది.వ్యవసాయాధికారులు శనగ పంట పరిస్థితి, పంట ప్రయోగాలు కూడా చేస్తున్నారు.శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.



కోసి కుప్పలుగా వేసిన శనగ పంట



యంత్రాలతో నూర్పిళ్లు చేస్తున్న దృశ్యం

### దిగుబడి తగ్గిపోయింది



పొలాల వద్ద శనగ పంటలో రైతుల సమక్షంలో పంట కోత ప్రయోగం చేస్తున్నాం.పంట దిగుబడి తగ్గిపోయింది.తుపాన్ దాటికి,పొగ మంచు కారణంగా పూత, మొగ్గ దశలో శనగ పూర్తిగా దెబ్బతింది.దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. పంట కోత ప్రయోగాలు చేశాం. ఉన్నతాధికారులు నివేదిస్తాం.

వెంకటకృష్ణారెడ్డి,ఏవో, ముద్దనూరు

### ప్రభుత్వం ఆదుకోవాలి



రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ పంట తుఫాన్, పొగ మంచు కారణంగా పూర్తిగా దెబ్బతింది. దీంతో పంట దిగుబడి తగ్గిపోయింది.పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. ప్రభుత్వం శనగ రైతులను ఆదుకోవాలి.

కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజులగురువాయపల్లె

### కుట్టుమిషన్ల వితరణ

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వితంతువుల జీవనోపాధికోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు వితరణ చేశారు. శనివారం విజయనగరం వీధికి చెందిన ప్రమీళ, శివలక్ష్మి, ఉట్టి శారద, మమత రెండు కుట్టుమిషన్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### మట్కా బీటరు అరెస్టు

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని అమృతాగార్డెన్స్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో మట్కా నిర్వహిస్తున్న వెంకట చౌడయ్య అనే బీటరును శనివారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. రామేశ్వరానికి చెందిన వెంకట చౌడయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.5 వేలు నగదు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

### అంగన్వాడీ నూతన కమిటీ

ముద్దనూరు ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి):మండల పరిధి యామవరం సెక్టారుకు సంబంధించి శనివారం ఏఐటీయూసీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కమిటీ ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల తెలిపారు. అధ్యక్షురాలుగా సరిత, ఉపాధ్యక్షురాలుగా ఉమాదేవి, ప్రధానకార్యదర్శిగా పద్మావతిని ఎన్నుకున్నట్లు, అలాగే కొంత మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు యూనియన్‌లో చేరినట్లు ఆమె తెలిపారు.

### లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో మాఘమాస ఆరంభం రెండో శనివారం పురస్కరించుకుని స్వామివారికి కుంభమేళా జలం కాశీక్షేత్రం నుంచి వచ్చిన పలురకాల జలాలతో స్వామివారికి విశేష అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం వల్లెరవారిపల్లె గ్రామానికి చెందిన మూరంరెడ్డి సుబ్బరామిరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

### 20 మద్యం సీసాలు స్వాధీనం

కేసు నమోదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మద్యం తీసుకుని విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కొండారెడ్డితెలిపారు .శనివారం సీతారాంపురం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు చేస్తుండగా అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ప్రభాకర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

### మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):మద్యం తాగి వాహనాలు నడిపే ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. శనివారం పోరుమామిళ్లలోని వరికుంట్ల బస్టాండు వద్ద మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను చెక్ చేశారు. వారు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేశారు . అలాగే పబ్లిక్ స్థలాలల్లో మద్యం తాగుతున్న ఇద్దరి వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### పలు సమస్యలపై వినతులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి గ్రీవెన్స్ (ప్రజావాణి) కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు సమస్యలపై అర్జీలు తెచ్చి ఆయనకు అందజేశారు. అర్జీలను స్వీకరించిన భూపేశ్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చేశారు.

### ఆటో డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ కొండారెడ్డి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని ఎస్ఐ కొండారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లందరికీ కౌన్సెలింగ్ చేశారు. ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలన్నారు.

### వైభవంగా ఏడుకొండల స్వామి వ్రతం



పోరుమామిళ్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి ఆధ్వర్యంలో ఏడుకొండల స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహిళా మండలి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### కళాశాల గేట్లు మూసివేసి నిరసన



ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా తమకు స్టైఫండ్ పెంచాలన్న డిమాండ్‌తో చేపట్టిన సమ్మె 6వ రోజుకు చేరింది. శనివారం పశువైద్య కళాశాల ప్రధాన గేట్లను మూసివేసి గంటపాటు విద్యార్థులు నిరసన తెలిపారు. తమడిమాండ్‌పై ప్రభుత్వం స్పందించి స్టైఫండ్‌ను పెంచి న్యాయం చేయాలని కోరారు. తదనంతరం కళాశాలలోపల ఏర్పాటు చేసుకున్న షామియానాల కింద కూర్చొని సాయంత్రం 4 వరకు నిరసన కొనసాగించారు.

### ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠ





కోలాటం వేస్తున్న చిన్నారులు, ప్రతిష్ఠ చేసిన విగ్రహాలు

చాపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరాముని ఆలయంలో శనివారం సీతారామ, లక్ష్మణ దేవతా విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠ చేశారు. విగ్రహాలకు ఎదురుగా బయట రాతి ధ్వజస్తంభాన్ని కూడా ప్రతిష్ఠ చేశారు. విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు జరిపారు. సీతారాముల వారికి కల్యాణం చేశారు. పాలాభిషేకం, ఆకుపూజ వంటి పూజలు నిర్వహించారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, పీఏడీఏ కమిషనర్ రామసుందర్‌రెడ్డి, పలు గ్రామాలకు చెందిన భక్తులు కూడా దైవదర్శనం చేసుకున్నారు. చెక్కభజన, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

### కడప ఉక్కుపై కేంద్రం నిర్లక్ష్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, అందులో జిల్లాకు విభజన హామీలలో పొందుపరిచిన కడప ఉక్కు కేంద్ర ప్రభుత్వం ఊసే లేకుండా నిర్లక్ష్యం చేస్తోందని డీవైఎఫ్ఐ నాయకులు విమర్శించారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలో ఎస్సీ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు యల్లయ్య, చంద్ర, అశోక్, పవన్, రాజు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ గెలుపు-దేశానికి మలుపు



ప్రొద్దుటూరులో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు దేశానికే పెద్దమలుపు అని బీజేపీ ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు ఆర్.నాగరాజు పేర్కొన్నారు. శనివారం ప్రకటించిన ఢిల్లీ ఫలితాల్లో బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోవడం ఒక చరిత్ర అన్నారు. వృద్ధాశ్రమంలో స్వీట్లు పంపిణీ చేశారు.

**ప్రొద్దుటూరు అర్బన్..:** ఢిల్లీలో జరిగిన ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా గురువారం ప్రొద్దుటూరు పట్టణం శివాలయం సర్కిల్‌లో బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సీవీ జయలక్ష్మి ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు నరేంద్రరావు, పాలెంరెడ్డి కిరణ్, ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కో-కన్వీనర్ గౌరీశంకర్, రాజుపాలెం మండల అధ్యక్షుడు ముల్లాస్మత్, నాయకులు చలపతిరావు, పలమేశ్వరరావు, హరికృష్ణ, ఏబీవీపీ శివ నారాయణ, మల్లికార్జున రావు, నాగార్జున, శ్రీరామ భక్త బృందం దశమందరం బాబు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జమ్మలమడుగుకు దొంగల భయం

● వరుస చోరీలతో ఆందోళన ● ఇంటి ఆవరణలో వస్తువులు మాయం ● పోలీసులు గస్తీతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



ట్రాక్టర్‌కు బ్యాటరీ, వస్తువులు చోరీ చేసిన దృశ్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ప్రజలకు దొంగల భయం పట్టుకుంది. జమ్మలమడుగు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో చోరీలు జరిగినా కొందరు భయపడి చెప్పలేక పోలీసు స్టేషన్‌కు వెళ్లలేక ఉన్నారు. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో దొంగల భయం పట్టుకుంది. వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంటి ఆవరణాల్లో వస్తువులు మాయం అవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురు, శుక్ర వారాల్లో రాత్రి సమయాల్లో కన్నెలూరు గ్రామం తాడిపత్రి రోడ్డులోని బైపాస్‌రోడ్డు, ఎస్.ఉప్పలపాడు తదితర ప్రాంతాల్లో ట్రాక్టర్లకు బ్యాటరీలు, ఇతర వస్తువులు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి తెలిపారు. ఉష్ణోగ్రతలు తెల్లవారుజామున చల్లగా ఉండడం వలన గ్రామీణ ప్రాంతాల్లోకానీ, పట్టణాల్లో ప్రజలు ఇంటిలో నిద్రిస్తుండడం వలన ఆవరణలో ఉన్న వస్తువులు రోజూ చోరీకి గురవుతున్నాయి. అందులో భాగంగా జమ్మలమడుగు పట్టణంలోని బ్యాంకుల వద్ద ఖాతాదారులు బంగారు తాకట్టుపెట్టి డబ్బులు తీసుకుని వెళ్లాలన్నా, రైతులు బ్యాంకు వద్దకు వచ్చి గతంలో తీసుకున్న రుణాలకు వడ్డీ డబ్బులు చెల్లించాలన్నా భయపడుతున్నారు. ఇటీవల జమ్మలమడుగు పట్టణంలో ప్రొద్దుటూరుకు రోడ్డులోని కెనరా బ్యాంకులో పెద్దదండ్లూరు గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు నుంచి అర్జీ రాస్తుండగా నాలుగు తులాల బంగారు, బ్యాగు కోసి చోరీ చేయడం జరిగింది. అలాగే నాలుగు రోజుల క్రితం జమ్మలమడుగులోని నాగులకట్ట చౌడేశ్వరీ దేవాలయంలో పట్టపగలు గేటుకు తాళం వేసినా పగులకొట్టి అమ్మవారి బంగారు నగలు, వెండి అపహరించారు. అలాగే మైలవరం మండలం దొమ్మరనంద్యాల, వేపరాల, తాడిపత్రి రోడ్డులో, జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డు, గూడెం చెరువు ప్రాంతాల్లో వరుస చోరీలు జరిగాయి. కొందరి ఇంట్లో సిలిండర్లు, ద్విచక్ర వాహనాలు, సిల్వర్ డేక్సాలు, ఇనుప మంచాలు తదితరవన్నీ చోరీ జరిగాయి. దీంతో ప్రజలు ఆందోళనలో పడ్డారు. రాత్రి సమయాల్లో పోలీసు అధికారులు, వారి సిబ్బంది ద్వారా గస్తీ పెంచి చోరీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన కూడలి రస్తాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, దీంతో చోరీలు జరిగినా వెంటనే పట్టుకోవడానికి ఆస్కారం ఉంటుందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.